క్లుప్తంగా

నేడు చండీహోమం

జడ్చర్ల టౌన్: అమావాస్య పురస్కరించుకుని దేవునిగుట్టతండా సమీపంలో శ్రీగిరి క్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో ఆదివారం చండీ హోమం నిర్వహించనున్నారు. లోక ల్యాణార్థం కార్యక్రమం చేపడుతున్నట్లు ఆచార్య కృష్ణస్వామి తెలియజేశారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం చేసిన అనంతరం హోమం జరిపించి అన్నదానం చేస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఘన సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రానికి చెందిన మాజీ కౌన్సిలర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సాలె మహ్మద్ కుటుంబం ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌ను ఘనంగా సన్మానించారు. పార్టీ నాయకులు బెక్కరి అనిత, మహ్మద్ ఇమ్రాన్, మహ్మద్ రహెమాన్, జాకీర్, అవేజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

చల్లా పేరు ప్రకటించడంపై హర్షం

సాక్షినెట్‌వర్క్ : పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డిని, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మన్నె జీవన్‌రెడ్డిని ప్రకటించడంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు అసెంబ్లీ యువజన ప్రధాన కార్యదర్శి మల్లు అనిల్‌కుమార్‌రెడ్డి శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నాగరాజు, మోహన్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. మిడ్జిల్ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, ఎంపీటీసీలు గౌస్, రాజారెడ్డి, కోయిల్‌కొండ ఎస్సీసెల్ అధ్యక్షుడు నాగరాజు, జిల్లాకేంద్రంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జె.చంద్రశేఖర్, రాజాపూర్ మండల అధ్యక్షుడు కృష్ణయ్య తదితరులు శనివారం ఆయా చోట్ల విలేకర్ల సమావేశం నిర్వహించారు. వంశీచంద్‌రెడ్డికి టికెట్ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉత్తమ మహిళా పారిశుద్ధ్య కార్మికులను చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ సన్మానించారు. వైస్‌చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ పవన్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, రవీందర్‌రెడ్డి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ వజ్రకుమార్‌రెడ్డి, మెప్మా సీఓ దేవమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక 15వ వార్డు పరిధిలో మున్సిపల్ చైర్మన్ తదితరులు పర్యటించారు. తమ హయాంలో వీలైనంత వరకు సమస్యలను పరిష్కరిస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు.

బీఆర్‌ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారు..

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ ప్రజాపాలనపై బీఆర్‌ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డిని మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ విమర్శించడం సరికాదన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

11మంది డైరెక్టర్ల ఎన్నిక

నారాయణపేట: నారాయణపేటలో శనివారం జరిగిన జిల్లా ఫిషర్ మాన్ కో - ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ ఎన్నికల్లో 11మంది సభ్యులు ఎన్నికైనట్లు జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ ఎలక్షన్ ఆఫీసర్ టైటస్ పాల్ తెలిపారు. ఈ ఎన్నికైన 11మంది పాలకవర్గ సభ్యుల నుంచి 12న జిల్లా ఫిషరీస్ కార్యాలయంలో అధ్యక్ష, ఉపాధ్యక్ష, ఎన్నిక జరుగుతుందని ఆయన తెలిపారు. డైరక్టర్లుగా ఎన్నికైన వారిలో ఉషనప్ప, నీరటి నర్సింహులు నాయుడు, కె.సరోజా, ఆంజనేయులు, ఆనంద్, ఏ. శ్రీనివాసులు, కాంతు కుమార్, వెంకటేష్, రామకృష్ణ, విజయ్ కుమార్ ఉన్నారు.

వీధికుక్కల బెడద

బాలానగర్: మండల పరిధిలోని పలుగ్రామాల్లో వీధికుక్కలతో స్థానికులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితుల నెలకొంటున్నాయి. కుక్కల సంఖ్య విపరీతంగా పెరగడంతో సమస్యలు తప్పడం లేదు. ముఖ్యంగా మోతీఘణాపూర్, తదితర గ్రామాల్లో పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. కుక్కలు గుంపులుగా తిరుగుతూ దాడులు చేస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అధిక సంఖ్యలో ఉండగా.. గుర్తు తెలియని వ్యక్తులు ఓ వెంచర్ పరిసరాల్లో డీసీఎంలో వీధికుక్కలను తీసుకువచ్చి వదిలేసి పోయారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడద తప్పించాలని కోరుతున్నారు.





చిన్నవడ్డేమాన్ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి



కందూర్ ఆలయంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు

వైభవంగా కల్యాణోత్సవం



నవాబుపేటలో శివపార్వతుల కల్యాణోత్సవం

సాక్షినెట్‌వర్క్: శివ రాత్రిని పురస్కరించుకొని చిన్న చింతకుంట మండలం చిన్న వడ్డేమాన్ గ్రామ సమీపంలో వెలసిన రామలింగేశ్వర స్వామిని జెడ్పీ చైర్ పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆలయంలో శివలింగానికి జలాభిషేకం పంచామృత అభిషేకం, రుద్రాభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అప్పంపల్లి సింగిల్‌విండో అధ్యక్షుడు సురేందర్‌రెడ్డితో పాటు ఆలయ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

కందూర్ రామలింగేశ్వరస్వామిని శుక్రవారం అర్ధ రాత్రి మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రధాన ఆలయంలోని శివలింగానికి లింగోద్భవ రుద్రాభిషేకం చేశారు. అనంతరం గౌరమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. పూజారులు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈఓ రాజేశ్వరశర్మ, జూనియర్ అసిస్టెంట్ అనంతసేన్‌రావు, స్థానిక నాయకులు నాగిరెడ్డి, రమేష్‌గౌడ్, రవీందర్‌శర్మ, బుచ్చన్నగౌడ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మూసాపేటలో అన్నదానం..

మూసాపేట మండల కేంద్రంలోని రామస్వామి గుట్టపై వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం ఉదయం భక్తుల రద్దీ నెలకొంది. శివ రాత్రి జాగరణ చేసిన భక్తులు ఉదయం ఆలయం వద్ద అభిషేకాలు చేశారు. తర్వాత వేముల గ్రామానికి చెందిన గోవింద్‌రెడ్డి అన్నదానం చేయించారు. ఇదిలా ఉండగా శుక్రవారం రాత్రి గుట్టపై ఆలయం ముందు అఖండ భజనలు చేశారు. మాజీ సర్పంచ్ భాస్కర్‌గౌడ్ అల్పాహారం ఏర్పాటు చేశారు.

భూత్పూర్ మండల కేంద్రంలోని రామలింగేశ్వర దేవాలయంలో శనివారం శివపార్వతుల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకుడు మంజునాథ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేటలోని కాశీనాథుడి ఆలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఇప్పటూర్, దొడ్డిపల్లి, రుద్రారం, కొల్లూర్, ఇప్పటూర్, కోటచింతల, మరికల్ గ్రామాల్లో సైతం శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ గోపాల్‌గౌడ్, మార్కెట్ మాజీ చైర్మన్ నర్సింహచారీ, సుధాకర్ చారీ, నర్సింహగౌడ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మూసాపేటలో భజనలు



భూత్పూర్‌లో కల్యాణోత్సవం

బాలానగర్‌లో తప్పని ట్రాఫిక్ తిప్పలు

బాలానగర్: మండల కేంద్రంలోని జాతీయరహదారి-44 ముఖ్య కూడలిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఐదు మంది మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదానికి ముఖ్య కారణం వాహనాల వేగంపై నియంత్రణ లేకపోవడం, ముఖ్య కూడలిలో భారీ వాహనాలు యూటర్న్ తీసుకోవడమని అధికారులు గుర్తించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ, ఏఎస్పీ చిత్తరంజన్ తదితరులు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని అదుపుచేయడంతో పాటు ముఖ్య కూడలిలో భారీ వాహనాల యూటర్న్ తీసుకోకుండా సిమెంట్ డివైడర్లు ఏర్పాటు చేశారు. డివైడర్‌ను కుదించి కేవలం అత్యవసరంగా వెళ్లే అంబులెన్స్‌లు, ద్విచక్రవాహనాలు, చిన్నపాటి కార్లు యూటర్న్ తీసుకునేందుకు వీలు కల్పించారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. భారీ వాహనాలు ఎప్పటిలాగే యూటర్న్ తీసుకుంటున్నాయని చెబుతున్నారు. దీంతో వాహనాలు రోడ్డుపై నిలిచి ట్రాఫిక్‌జాం కావడం సర్వసాధారణం అయిపోయిందని వాపోతున్నారు. ఈ విషయంపై పోలీస్ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించడం లేదని అంటున్నారు. ఉన్న సిమెంట్ దిమ్మెలను తీసివేసి ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. లేదంటే మరోమారు ప్రమాదాలు చోటుచేసుకోవడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మండల కేంద్రంలోని ముఖ్య కూడలిలో యూ టర్న్ తీసుకుంటున్న భారీ వాహనాలు

గుంతలమయంగా బీటీరోడ్డు

అడ్డాకుల: మూసాపేట మండలం దాసర్‌పల్లి గ్రామం నుంచి చెన్నంపల్లి వరకు బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. దాసర్‌పల్లి నుంచి చెరువు కట్ట మీదుగా చెన్నంపల్లి వరకు చాలా చోట్ల బీటీరోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. చెరువు కట్టపై ఉన్న గుంతల మూలంగా వాహనాలు అదుపు తప్పితే చెరువులోకి దూసుకెళ్లే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెన్నంపల్లి సమీపంలోని మలుపుల వద్ద రోడ్డుపై ఉన్న గుంతల వల్ల వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఈ రోడ్డుపై ప్రతి రోజు ఆటోలు, ద్విచక్రవాహనాలు తిరుగుతుంటాయి. దాసర్‌పల్లి, చెన్నంపల్లితో పాటు నందిపేట గ్రామానికి రాకపోకలు సాగిస్తారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



బీటీరోడ్డుపై గుంతలు

నేడు ఎమ్మెల్యే రాక

దేవరకద్ర: ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆదివారం దేవరకద్ర మండలంలో జరిగే వివిధ కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం వెంకటాయపల్లిలో మల్లన్న జాతరలో పాల్గొంటారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి 12 గంటల వరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజలకు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని, 12.30 గంటలకు ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి దేవరకద్రకు మొదటిసారి వస్తున్న సందర్భంగా స్వాగత కార్యక్రమం నిర్వహిస్తారని వివరించారు.

నల్లాపన్ను వసూళ్లు అంతంతే..



నల్లాపన్ను వసూలు చేసి రశీదు ఇస్తున్న మున్సిపల్ సిబ్బంది

- లక్ష్యం రూ.1కోటి
- వసూలైంది రూ.20లక్షలు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలో నల్లా పన్ను వసూళ్లు నిరాశజనకంగా ఉన్నాయి. 2023-24 ఏడాదికి సంబంధించి నల్లా పన్ను వసూలు లక్ష్యం రూ.1కోటి ఉండగా మార్చి 7నాటికి రూ.20లక్షలు వసూలయ్యాయి. వాస్తవానికి మున్సిపాలిటీ పరిధిలో మిషన్‌భగీరథ, మున్సిపల్ నల్లా కనెక్షన్లు మొత్తం 11వేలకుపైగా ఉన్నాయి. వీటిలో బాదేపల్లి గ్రామ పరిధిలో 7,400 ఉండగా మిగిలిన 3,600 జడ్చర్ల, కావేరమ్మపేట, నాగసాల, బూరెడ్డిపల్లి గ్రామాల్లో ఉన్నాయి. అయితే బాదేపల్లి పట్టణంలోని నల్లాకనెక్షన్లు అన్నీ ఆన్‌లైన్‌లో నమోదయ్యాయి. జడ్చర్ల, కావేరమ్మపేట, బూరెడ్డిపల్లి, నాగసాలల్లో ఆన్‌లైన్ నమోదులు పూర్తికాలేదు. ఈ కారణంగా పన్నుల వసూలు పూర్తిగా మందగించాయి. నల్లా పన్ను వసూలుకు రెండు బృందాలు ఏర్పాటయ్యాయి. కాగా ఒక బృందం బాదేపల్లి, మరో బృందం జడ్చర్ల, కావేరమ్మపేటల్లో వసూలు చేస్తుంది.

ఉచితంగా భావించటంతో పేరుకుపోతున్న బకాయిలు

అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పటి ప్రజాప్రతినిధులు నల్లా పన్ను చెల్లించరాదంటూ ప్రకటనలు ఇచ్చారు. దీంతో పట్టణ వాసులు నల్లా పన్ను ఉండదని భావించారు. దీంతో పన్ను చెల్లించటానికి ముందుకు రాలేదు. వాస్తవానికి నల్లా కనెక్షన్ కలిగిన ప్రతి ఒక్కరు ప్రతినెలా రూ.100 పన్ను చెల్లించాల్సి ఉంది. పన్ను చెల్లించకపోవటంతో ఒక్కో ఇంటికి రూ.800 నుంచి రూ. 2వేల వరకు బకాయిలు పేరుకుపోయాయి. ఎన్నికలు ముగిసి ప్రభుత్వం మారటంతో నల్లా పన్ను చెల్లించాలని సిబ్బంది ఇంటికి వస్తుండటంతో పట్టణవాసులు అవాక్కవుతున్నారు. కొందరు ఎప్పటికైనా తప్పదనే ధోరణిలో పన్ను చెల్లిస్తుండగా అధికశాతం పట్టణవాసులు పన్ను చెల్లించేందుకు ముందుకు రావటం లేదు. ఈ కారణంగా బకాయిలు ఏటా పెరుగుతూనే ఉన్నాయి.

పన్ను చెల్లించి సహకరించాలి



మిషన్‌భగీరథ, మున్సిపల్ నల్లా కనెక్షన్ కలిగిన ప్రతి ఒక్కరు పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి. బకాయిలు కలుపుకొని మున్సిపాలిటీ పరిధిలో రూ.1కోటి పన్ను వసూలు కావాల్సి ఉంది. ఇందుకోసం రెండు బృందాలను ప్రత్యేకంగా నియమించాం. ఇప్పటి వరకు రూ.20లక్షలు వసూలైంది. ప్రజల్లో అవగాహన కల్పించి నల్లాపన్ను వసూలు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– రాజయ్య, కమిషనర్, మున్సిపాలిటీ, జడ్చర్ల

ఘనంగా శకటోత్సవం



చలమేశ్వర ఆలయం వద్ద ట్రాక్టర్ల ప్రదర్శనలు

జడ్చర్ల టౌన్: మండలంలోని చలమేశ్వర ఆలయం, శివగిరిక్షేత్రం, మీనాంబరం పర్వవేదీశ్వర ఆలయాల్లో శనివారం శకటోత్సవం వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయాల వద్ద కోలాహలం నెలకొంది. ట్రాక్టర్లు, వాహనాలు అలంకరించి ఆలయాల చుట్టు ప్రదక్షిణలు చేశారు. భక్తులు ఉపవాస దీక్షలు ముగించి మరోమారు శివుడికి అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

క్రీడలు క్రమశిక్షణను పెంపొందిస్తాయి



మాట్లాడుతున్న ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి

నవాబుపేట: క్రీడలు యువతలో క్రమశిక్షణను పెంపొందిస్తాయని ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు. శనివారం ఇప్పటూర్‌లో మండల స్థాయి వాలీబాల్ టోర్నీని ప్రారంభించి మాట్లాడారు. యువత దురలవాట్లకు దూరంగా ఉండి ముందుకు సాగితే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. వాలీబాల్ అకాడమీ జిల్లా ప్రధానకార్యదర్శి చెన్నవీరయ్య, ఎంపీటీసీ నవనీత్‌రావు తదితరులు ఉన్నారు.

ముస్తాబవుతున్న మసీదులు



జడ్చర్లలోని 167వ నంబరు జాతీయరహదారిపై ఉన్న మసీదు

జడ్చర్ల టౌన్: పవిత్ర రంజాన్ నేపథ్యంలో పట్టణంలోని అన్ని మసీదులు ప్రత్యేక ప్రార్థనలకోసం ముస్తాబవుతున్నాయి. ఈనెల 12 నుంచి ఉపవాసదీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు నెలరోజుల పాటు జరిగే కార్యక్రమాల కోసం ఏర్పాట్లు సాగుతున్నాయి. పట్టణంలోని పేరుగాంచిన మసీదులన్నింటిని విద్యుత్ దీపాలతో ఇప్పటికే అలంకరించారు.

పార్లమెంట్ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి

- ఏపీ మిథున్‌రెడ్డి

పాలమూరు: హైదరాబాద్‌లో త్వరలో నిర్వహించే హోంశాఖ మంత్రి అమిత్ షా సమావేశం నేపథ్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని పలు వార్డులోని బూత్ అధ్యక్షులు, శక్తికేంద్రం ఇన్‌చార్జ్‌లు, జోనల్ ఇన్‌చార్జ్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నేత ఏపీ మిథున్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రాబోయో పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన సరళిని తెలియజేశారు. పోలింగ్ బూత్‌ల బలోపేతం చేయడంపై దృష్టి పెట్టినట్లు వివరించారు. వాటికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అంజయ్య, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: రాబోయే పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని అన్నాసాగర్‌లోని ఆయన నివాసంలో శనివారం దేవరకద్ర నియోజక వర్గంలోని వివిధ మండలాలకు చెందిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, మండల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సోమవారం జిల్లా కేంద్రంలోని జేజేఆర్ గార్డెన్‌లో పార్లమెంట్, నియోజక వర్గ స్థాయిలో బీఆర్‌ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశం ఉంటుందని, పార్టీ శ్రేణులు ప్రతి ఒక్కరు పాల్గొనాలని మాజీ ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రాబోయే ఎమ్మెల్సీ, పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సి వ్యూహాలను పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో దేవరకద్ర నియోజక వర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు, మండల ముఖ్యనేతలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్య కేంద్రాలు



శిథిలావస్థలో వేముల పశువైద్య కేంద్రం



మూసాపేటలో..

అడ్డాకుల: మూసాపేట, వేముల గ్రామాల్లోని పశువైద్య కేంద్రాలు శిథిలావస్థకు చేరాయి. రెండు గ్రామాల్లోని భవనాల పైకప్పు నుంచి తరుచూ పెచ్చులు ఊడి పడుతున్నాయి. మూసాపేటలో వర్షాకాలంలో ఆస్పత్రిలో ఉండి పని చేయడానికి సిబ్బంది భయపడే విధంగా పైకప్పు ఉంది. అయినా సరే ఆస్పత్రిలో పని చేసే సిబ్బంది అందులోనే ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు. భవనం లోపల ఉండటానికి వైద్య సిబ్బంది సాహసం చేయాల్సిన పరిస్థితే ఉంది. మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరినా పట్టించుకునే వారు కరువయ్యారు. గత వర్షాకాలంలో భవనాన్ని ఖాళీ చేసి యువజన సంఘం భవనంలో ఏర్పాటు చేయాలని భావించినా వీలు కాలేదు. వేముల పశువైద్య కేంద్రం కూడా శిథిలావస్థలో ఉంది. ఇక్కడ కూడా పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. భవనం లోపల గోడలు బీటలు వారాయి. ఇక్కడ మండల పశువైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ విధులు నిర్వహిస్తున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా అధికారులు స్పందించి పశువైద్య కేంద్రాలను బాగు చేయించాల్సిన అవసరముందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

నారాయణపేట రూరల్: సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుండటంతో సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌ఐ బాలయ్య సూచించారు. మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో శనివారం పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. విద్యార్థినులు, మహిళలు అత్యవసర సమయంలో తమ రక్షణకు షీ టీమ్స్ ఉంటాయనే విషయంపై తెలుసుకుని ఉండాలన్నారు. ఎవరైన ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100, మహిళా హెల్ప్ లైన్ నెంబర్ 8712670398కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం

నవాబుపేట: కొత్తపల్లికి చెందిన అలవేలు (35) అదృశ్యమైనట్లు శనివారం ఆమె సోదరుడు వెంకటేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా.. అలవేలుకు 15ఏళ్ల కిత్రం వివాహమైంది. కాగా మతిస్థిమితం కోల్పోవడంతో ఆమె తల్లిగారి ఇంటిదగ్గరే ఉంటుంది. కాగా ఈ నెల 15న ఇంట్లో ఎవరు లేని సమయంలో ఎటో వెళ్లిపోయింది. ఆచూకీ లభించకపోవడంతో ఆమె సోదరుడు ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు.